సాక్షి విశాఖపట్నం

శనివారం । 9 । ఆగస్టు । 2025

సకల సౌభాగ్యదాయినీ నమోస్తుతే..







శ్రావణ మాసం మూడో శుక్రవారం వరలక్ష్మీవ్రతాలతో నగరంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ప్రతి ఇల్లూ ఓ ఆలయాన్ని తలపించింది. మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారి ఆలయాల వద్ద సామూహిక వ్రతాల్లో పాల్గొన్నారు. నగరంలోని కనకమహాలక్ష్మి, కన్యకాపరమేశ్వరి, లలితాంబిక ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

8లో

భలేభలే రాఖీ పువ్వులు







సోదర, సోదరీల ప్రేమకు ప్రతీక అయిన రాఖీ పండుగకు గుర్తుగా ఉండే 'రాఖీ పువ్వులు' పెదవాల్తేరులో ఉన్న బయో డైవర్సిటీ పార్కులో పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ పువ్వులు రాఖీ మాదిరిగా ఐదు రేకులతో అందంగా ఉంటాయి. ఇవి తీగలకు పూయడం వల్ల చేతికి కట్టుకోవడానికి కూడా అనువుగా ఉంటాయి. దీనిని 'కృష్ణ కమలం' అని, ప్రపంచవ్యాప్తంగా 'ఫ్యాషన్ ఫ్లవర్' అని కూడా పిలుస్తారు. ఇది సాధారణంగా అమెరికా, బ్రెజిల్, కొలంబియా వంటి దేశాల్లో పెరుగుతుంది. బయో డైవర్సిటీ పార్కు నిర్వాహకులు ఈ పువ్వుల ప్రాముఖ్యతను వివరించడంతో పాటు, వాటిని ఎలా పెంచాలో కూడా సందర్శకులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్లాస్టిక్ రాఖీలకు బదులుగా సహజసిద్ధమైన ఈ రాఖీ పువ్వులను ఉపయోగించుకోవచ్చని వారు సూచిస్తున్నారు.

- బీచ్‌రోడ్డు

• ఆరంభం అదుర్స్

8లో

ట్రోఫీ ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, విక్టరీ వెంకటేష్



నగరంలోని డా.వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ మైదానంలో ఏపీఎల్ 4వ సీజన్ అట్టహాసంగా శుక్రవారం ప్రారంభమైంది. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, భారత మహిళా జట్టు మాజీ కెప్టెన్ మిథాలీరాజ్, సీజన్ బ్రాండ్ అంబాసిడర్ విక్టరీ వెంకటేష్ ట్రోఫీని ఆవిష్కరించగా, సినీ నటి ప్రజ్ఞాజైస్వాల్ షో ఉర్రూతలూగించింది. తొలి మ్యాచ్‌లో టాస్ ఓడి కాకినాడ కింగ్స్ బ్యాటింగ్‌కు దిగి ఐదు వికెట్లకు 229 పరుగులు సాధించింది. వర్షం కారణంగా అమరావతి రాయల్స్‌కు 14 ఓవర్లకు 173 లక్ష్యంగా నిర్ధారించారు. రాయల్స్ జట్టు 13.2 ఓవర్లలోనే 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. - విశాఖ స్పోర్ట్స్

ప్రజ్ఞా 'జోష్'వాల్



దేశభక్తిని చాటిచెప్పేలా 'హర్ ఘర్ తిరంగా'



మహారాణిపేట: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం శుక్రవారం నుంచి ఆగస్టు 15 వరకు జిల్లాలో జరుగుతుందని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. స్వాతంత్య్ర స్ఫూర్తిని, దేశభక్తిని పెంపొందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం నుంచి 13 వరకు 'తిరంగా యాత్ర', 'తిరంగా సెల్ఫీలు', 'తిరంగా ట్రిబ్యూట్', 'తిరంగా మేళా' కార్యక్రమాలు జరుగుతాయి. ఆగస్టు 12న ఉదయం 7 గంటలకు బీచ్ రోడ్డులోని కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు భారీ తిరంగా ర్యాలీ నిర్వహిస్తారు. ఈ ర్యాలీలో ప్రజలందరూ పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అలాగే పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు దేశభక్తి గేయాలు, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణ బాధ్యతను జీవీఎంసీ పరిధిలో యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్, గ్రామీణ ప్రాంతాల్లో జెడ్పీ సీఈఓ చూసుకుంటారని కలెక్టర్ వివరించారు. అందరూ ఈ కార్యక్రమాలలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

'సౌభాగ్యం' కిట్లు పంపిణీ



సౌభాగ్య వస్తువులను అందజేస్తున్న నిర్వాహకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం (తితిదే)లో శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే), హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో 'సౌభాగ్యం' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సాయంత్రం 4 గంటలకు శ్రీవారి దర్శనానికి వచ్చిన ముత్తైదువులకు పసుపు కొమ్ములు, కుంకుమ, గాజులు, కంకణాలు అందజేశారు. ముందుగా, సౌభాగ్య కిట్‌లను శ్రీవారి ఆలయం చుట్టూ మంగళవాయిద్యాల నడుమ ప్రదర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు, సూపరింటెండెంట్ వెంకటరమణ, హిందూ ధర్మ ప్రచార సిబ్బంది, జిల్లా ధార్మిక ప్రచార కమిటీ సభ్యులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

చినబాబుకు రూ.12 కోట్ల చదివింపులు



- ఇప్పటికే చెల్లించిన రియల్టర్లు
- డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ పేరుతో రంగ ప్రవేశం
- ఎండాడలో ఇప్పటికే పలు ప్రాజెక్టులు చేపట్టిన ఓ సంస్థ
- దసపల్లా భూముల వ్యవహారంలోని మరో రియల్టర్‌కు అప్పగింత
- విచారణ చేయాలని అన్ని పక్షాల నుంచి డిమాండ్
- కమిటీ కష్టమంటూ కలెక్టర్ నివేదికతోనే స్పీకర్‌ను బుజ్జగించే యత్నం?

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

నిషేధిత జాబితా నుంచి తొలగించిన ఎండాడలోని 5.10 ఎకరాల భూ వ్యవహారంలో చినబాబుకు ఇప్పటికే రూ.12 కోట్ల చదివింపులు పూర్తయినట్టు తెలుస్తోంది. ఈ చెల్లింపుల వ్యవహారాన్ని మొత్తం దక్షిణ నియోజకవర్గానికి చెందిన ఓ టీడీపీ నేత చూసినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ చెల్లింపులు పూర్తయిన తర్వాత ఎండాడలోని సర్వే నంబరు 14-1 లోని 5.10 ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించినట్టు సమాచారం. ఈ భూమిని అభివృద్ధి చేసేందుకు ఇద్దరు రియల్ ఎస్టేట్ సంస్థలు రంగప్రవేశం చేశాయి. ఇప్పటికే ఎండాడలో పలు ప్రాజెక్టులు చేపట్టిన సంస్థ ఒకటి కాగా.. చినబాబు సామాజికవర్గానికే చెంది, దసపల్లా భూముల వ్యవహారాల్లో ఉన్న మరో సంస్థ రంగంలోకి దిగినట్టు తెలుస్తోంది. ఈ స్థలంలో 14 ఫ్లోర్ల వరకూ నిర్మించే అవకాశం ఉందని.. తక్కువలో తక్కువగా చదరపు అడుగుకు ప్రారంభంలోనే రూ.6 వేల వరకూ ధర పలికే అవకాశం ఉందని సదరు రియల్టర్లు లెక్కలు వేసినట్టు కూడా తెలుస్తోంది. వాస్తవానికి ఇప్పటికే హైదరాబాద్‌కు చెందిన ఒక సంస్థ పేరు మీద కొంత భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయింది. ఆ సంస్థ నుంచి విశాఖకు చెందిన ఈ ఇద్దరు రియల్టర్ల చేతికి రానుందని సమాచారం. ఈ మేరకు ఇప్పటికే అనధికారికంగా ఒప్పందం జరిగినట్టు కూడా తెలుస్తోంది. మరోవైపు ఈ భూమి వ్యవహారంలో విచారణ చేయాలంటూ ప్రతిపక్షంతో పాటు స్వపక్షం నుంచి కూడా స్పష్టమైన డిమాండ్లు వస్తున్నాయి. కమిటీ వేసి విచారణ చేయాలంటూ స్వయంగా స్పీకర్ కోరినప్పటికీ కుదరదని కలెక్టర్ నివేదికతోనే సరిపుచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్టు తెలుస్తోంది. మొత్తంగా నేరుగా చినబాబు పాత్ర ఉండటంతో విచారణ జరిపేందుకు ప్రభుత్వం వెనకాడుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మరిన్ని భూములపై నిషేధం ఎత్తివేత..!

వాస్తవానికి ఎండాడలోని 14-1 సర్వే నంబరుకు చెందిన 5.10 ఎకరాల భూమికి చెందిన రికార్డుల్లో రెవెన్యూ అధికారులనూ తికమక పెట్టే వ్యవహారాలు నడిచాయనే విమర్శలున్నాయి. ఫలానా పేరు మీద ఈ భూమి ఉందని...అయినప్పటికీ ఇది ప్రభుత్వ భూమి కావున రిజిస్ట్రేషన్ చేయవద్దంటూ స్వయంగా గతంలో కలెక్టర్ రిజిస్ట్రేషన్ల శాఖను ఆదేశించారు. తీరా నిషేధిత జాబితా నుంచి తొలగించే సమయానికి ప్రైవేటుపరం చేస్తూ నిర్ణయాలు వెలువడ్డాయి. వాస్తవానికి 14-1 సర్వే నంబరులోని భూమి చెట్టిపల్లి సీతారామయ్య పేరు మీద నమోదై ఉంది. అయితే తాజాగా కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల్లో మాత్రం ఈ భూమి మాజీ సైనిక అధికారికి చెందినదని, చెట్టిపల్లి సీతారామయ్య పేరు కేవలం ఫారం-3లో మాత్రమే ఉందని పేర్కొన్నారు. అయితే ఇందుకు భిన్నంగా అసలు వ్యక్తి సాగులోనే లేరంటూ వై.బాలిరెడ్డికి చెందినదంటూ ఆయన పేరు మీద బదలాయించాలంటూ ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో పై నుంచి ఆదేశాలు వచ్చేందుకు కీలకంగా వ్యవహరించిన విశాఖ దక్షిణ నియోజకవర్గానికి చెందిన నేత ప్రధానంగా చక్రం తిప్పినట్టు సమాచారం. చినబాబు అండతో రెచ్చిపోయారనే విమర్శలున్నాయి. ఎన్నికలకు ముందు చినబాబుకు నేరుగా తమ సామాజిక వర్గానికి చెందిన నేతల ద్వారా హైదరాబాద్‌లో భారీగా ఎలక్షన్ ఫండ్ సమకూర్చడంతో ఈ నేతకు సదరు చిన్నబాబు వద్ద పలుకుబడి ఉన్నట్టు పార్టీలో చర్చ జరుగుతోంది. స్థానిక నేతలు, ఎమ్మెల్యేలతో ఏ మాత్రం సంబంధం లేకుండా వ్యవహారాలు నడుపుతుండటంతో సదరు దక్షిణ నియోజకవర్గ నేతపై ఆ పార్టీలోని ఇతర నేతలందరూ రుసరుసలాడుతున్నట్టు తెలుస్తోంది. అయినప్పటికీ ఇంకా ఏమైనా ఫైల్స్ ఉంటే తన వద్దకు తీసుకురావాలంటూ సదరు దక్షిణ నియోజకవర్గ నేత కోరుతున్నట్టు తెలుస్తోంది. అంటే త్వరలో మరిన్ని ప్రభుత్వ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించనున్నారన్నమాట.

కమిటీ కష్టం... కలెక్టర్ నివేదికతోనే సరి...!

వాస్తవానికి ఎండాడ భూమి వ్యవహారంలో సొంత పార్టీ నేతల నుంచే విచారణ జరపాలనే డిమాండ్ వస్తోంది. ఇప్పటికే ఈ భూమి వ్యవహారంపై విచారణ జరిపించాలంటూ స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కలెక్టర్‌కు లేఖ రాశారు. న్యాయవిచారణ జరగాల్సిన అవసరం ఉందని కూడా అభిప్రాయపడ్డారు. మరోవైపు నివేదిక సమర్పించాలంటూ రెవెన్యూ మంత్రికి స్పీకర్ లేఖ ద్వారా ఆదేశించారు. ఇక మండలిలోని ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ సైతం ఈ వ్యవహారంలో లోతుగా విచారణ జరిపి వాస్తవాలు బయట పెట్టాలంటూ నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. మాజీ సైనికులకు చెందిన భూముల విషయంలో సీనియర్ అధికారులు, రాజకీయ నేతల ప్రమేయం ఉండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ల్యాండ్ గ్రాబింగ్ వ్యవహారాల్లో అటు అధికారులు, ఇటు రాజకీయ నేతల మధ్య ఏర్పడుతున్న అనైతిక సంబంధాలు ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తాయన్న ఆందోళనను ఆయన వ్యక్తం చేశారు. జనసేన కార్పొరేటర్ సైతం విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఇలా అన్ని పార్టీల నేతలు ఎండాడ భూమి విషయంలో అటు అధికారులు, ఇటు రాజకీయ నేతల ప్రమేయం ఉందన్న అభిప్రాయాన్ని బలంగానే వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి మాత్రం నామమాత్ర స్పందన రాకపోవడం గమనార్హం. అంతేకాకుండా కమిటీ వేయాలని రెవెన్యూ మంత్రికి రాసిన లేఖలో స్పీకర్ కోరగా.. కమిటీ వేయాలంటే ముఖ్యమంత్రి అనుమతి కావాలని తేల్చిచెప్పినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే కేవలం కలెక్టర్ ఇచ్చిన నివేదికనే స్పీకర్‌కు.. రెవెన్యూ మంత్రి ఇవ్వనున్నట్టు అధికార వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. స్వయంగా సొంత పార్టీకే చెందిన స్పీకర్ కోరినప్పటికీ ప్రభుత్వం పెద్దగా సీరియస్‌గా తీసుకోలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో ఈ వ్యవహారంలో చినబాబు పాత్ర ఉండటం వల్లే ప్రభుత్వం నుంచి స్పందన లేదన్న అభిప్రాయం అందరిలోనూ బలపడుతోంది.

గంజాయి స్మగ్లర్ల ఆస్తులు కూడా జప్తు చేస్తాం



జైల్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న ఈగల్ క్లబ్ చీఫ్ రవి కృష్ణ

ఆరిలోవ: పోలీసులకు పట్టబడిన గంజాయి స్మగ్లర్ల ఆస్తులను కూడా జప్తు చేస్తామని ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్(ఈగల్) క్లబ్ చీఫ్, ఐజీ ఆకే రవికృష్ణ తెలిపారు. విశాఖ కేంద్ర కారాగారాన్ని ఆయన అధ్యక్షతన ఈగల్ క్లబ్ శుక్రవారం సందర్శించింది. కారాగారం సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు, డిప్యూటీ సూపరింటెండెంట్లు ఎన్.సాయిప్రవీణ్, సీహెచ్ సూర్యనారాయణ, జైలర్లు, ఈగల్ బృందంతో కలసి గంజాయి కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలతో మాట్లాడి ఎన్‌డీపీఎస్ చట్టంపై అవగాహన కల్పించారు. ఏయే కేసుల్లో జైలుకు వచ్చారు, ఏ పరిస్థితిలో ఎన్‌డీపీఎస్ కేసుల్లో ఇరుకున్నారు, తదితర వాటి గురించి ఆరా తీశారు. అనంతరం జైల్ బయట ఆయన మీడియాతో మాట్లాడారు. రెండు సార్లు కంటే ఎక్కువ గంజాయి కేసులు నమోదైతే అలాంటివారిపై సస్పెక్టెడ్ షీట్ తెరుస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంతవరకు 3,700 మందిపై సస్పెక్టెడ్ షీట్ నమోదు చేసినట్లు తెలిపారు. అల్లూరి జిల్లాలో డ్రోన్‌ల ద్వారా గంజాయి సాగును గుర్తించి నాశనం చేశామన్నారు. ఒడిశా నుంచి దిగుమతి అవుతున్న గంజాయిని సరఫరా చేస్తూ రాష్ట్రంలో పోలీసులకు పలువురు పట్టుబడుతున్నట్లు తెలిపారు. దానివల్ల రాష్ట్రంలో గంజాయి కేసుల్లో పట్టుబడినవారి సంఖ్య పెరుగుతోందన్నారు. విశాఖ కేంద్ర కారాగారంలో 1,800 మంది ఖైదీలు ఉంటే వారిలో 1,008 మంది గంజాయి కేసుల్లో వచ్చినవారేనని వెల్లడించారు. గంజాయి, డ్రగ్స్ సరఫరా చేస్తున్న వారిపై ఈగల్ క్లబ్ టోల్ ఫ్రీ నంబర్ 1972 కు ఫోన్ చేసి, సమాచారం అందించవచ్చని సూచించారు.

నేడు బీసీ వెల్ఫేర్ జోన్-1 సమీక్ష

ఎంవీపీ కాలనీ: రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ జోన్-1 జిల్లాల సమీక్ష శనివారం జరగనుంది. రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఆయా జిల్లాల ఉన్నతాధికారులు, బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్లు, ఇతర అధికారులు సమావేశంలో పాల్గొనున్నారు. ప్రధానంగా బీసీ సంక్షేమశాఖ ద్వారా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, హాస్టళ్ల నిర్వహణ, విద్యార్థుల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చించనున్నట్లు జిల్లా బీసీ వెల్ఫేర్ ఇన్‌ఛార్జ్ డీడీ రామారావు తెలిపారు.

విశాఖలో ఆటీన్ రాణులు

- భర్త ఫిర్యాదుతో వెలుగులోకి మహిళల 'చతుర్ముఖ పారాయణం'
- పేకాడ డెన్‌లు నిర్వహిస్తున్న పలువురు అతివలు
- కుటుంబాన్ని పట్టించుకోకుండా మూడు ముక్కలాట
- సీపీకి ఫిర్యాదు చేసిన ఓ భర్త
- వెలుగులోకి వచ్చిన మహిళల జూద క్రీడ
- ఆరుగురు మహిళల అరెస్ట్.. రూ.22 వేలు స్వాధీనం



విశాఖ సిటీ: విశాఖ ఆటీన్ రాణులు పెరిగిపోతున్నారు. చతుర్ముఖ పారాయణంలో మునిగితేలుతున్నారు. పలువురు మహిళలు ఏకంగా పేకాట డెన్‌లు సైతం నిర్వహిస్తున్నారు. కుటుంబాలను సైతం పట్టించుకోకుండా మూడు ముక్కలాటలో నిమగ్నమైపోతున్నారు. తన భార్య పేకాట మత్తులో పడి తమను పట్టించుకోవడం లేదని ఒక భర్త నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చికి ఫిర్యాదు చేయడం హాట్ టాపిక్‌గా మారింది. మహిళామణుల జూద క్రీడ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో పోలీసులు ఆరుగురు మహిళలను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.22 వేలు స్వాధీనం చేసుకున్నారు.

ఇళ్లే పేకాట డెన్‌లు

జూద క్రీడ అంటే టక్కున గుర్తొచ్చేది మగ మహారాజులే. ఇప్పటి వరకు పేకాట ఆడుతూ పోలీసులకు చిక్కిన వారంతా మగవారే. కానీ ఇపుడు కాలం మారిపోయింది. అన్నింట్లోను సమానమే అన్నట్లు ముక్కలాటలోను జోరుమీద ఉన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక గ్యాంగ్‌ను సిద్ధం చేసుకుంటున్నారు. జూద క్రీడకు ఎక్కడకు వెళ్లకుండానే ఇళ్లనే పేకాట డెన్లుగా మార్చేసుకుంటున్నారు. భర్తలను, పిల్లలను సైతం పట్టించుకోకుండా ముక్కలు విసిరే పనిలో బిజీగా ఉంటున్నారు. దీన్నే కొందరు ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు. ఇళ్లలో పేకాట నిర్వహణకు కమీషన్ సైతం తీసుకుంటున్నారు. కొన్ని అపార్టుమెంట్లలో జోరుగా పేకాట నిర్వహిస్తున్నారు.

ఆరుగురి అరెస్ట్

సీపీ ఆదేశాలతో పోలీసులు ఆ ఇంటిపై దాడులు చేశారు. లోపల పేకాట ఆడుతున్న ఆరుగురు మహిళలను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.22 వేలను స్వాధీనం చేసుకున్నారు. వీరిలో కొందరు కొన్నేళ్లుగా వివిధ ప్రాంతాల్లో నిత్యం పేకాట ఆడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఇదే పనిలో ఉంటున్నట్లు తెలుసుకున్నారు. ఇటువంటి వారిపై పోలీసులు నిఘా పెట్టారు. వీరు ఎక్కడెక్కడ పేకాట నిర్వహిస్తున్నారన్న విషయంపై దృష్టి పెట్టినట్లు సమాచారం.

భార్య పేకాటపై భర్త ఫిర్యాదు

ఇప్పటి వరకు సీరియల్స్, సినిమాలు, ఫోన్లలో పడి భర్తలు, పిల్లలను పట్టించుకోని ఆడవారు ఉన్నట్లు వింటూ వస్తున్నాం. కానీ పేకాటలో పడి పిల్లలను, తనను పట్టించుకోవడం లేదన్న విషయం ఒక భర్త ఫిర్యాదుతో తాజాగా వెలుగులోకి వచ్చింది. అక్కయ్యపాలెం లలితానగర్ ప్రాంతంలో ఒక ఇల్లు పేకాట డెన్‌గా మారింది. ఆ ఇంటి గృహిణే ఈ జూద క్రీడకు లీడర్‌గా వ్యవహరిస్తోంది. ఇతర ప్రాంతాల నుంచి మహిళలను రప్పించి ఆ ఇంట్లో నిత్యం మూడు ముక్కలాట ఆడిస్తోంది. భర్తను, పిల్లలను సైతం పట్టించుకోకుండా ఆటోలోనే మునిగితేలుతోంది. భర్త ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదు. దీంతో విసుగెత్తిపోయిన భర్త ఇటీవల ఫోర్త్ టౌన్ సీఐ సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. అతను పట్టించుకోకపోవడంతో నేరుగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చికి ఫిర్యాదు చేశారు. తన భార్య పేకాట కారణంగా ఇబ్బందులు పడుతున్నట్లు తన గోడును విన్నవించుకున్నాడు. పేకాట డెన్‌గా మారిపోయిన తమ ఇంటిని మార్చాలని కోరారు. దీనికి స్పందించిన సీపీ విచారణ అనంతరం సీఐని బదిలీ చేశారు.

శ్రీకృష్ణాపురం గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

ఆరిలోవ: శ్రీకృష్ణాపురం సాంఘిక సంక్షేమ గురుకులంలో మిగులు సీట్లు ఎస్సీ విద్యార్థుల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఇక్కడ ఐదో తరగతి 37, ఆరో తరగతి 6, ఏడో తరగతి 2, టెన్త్ 9, ఇంటర్ ఐఐటీ అండ్ నీట్ 38 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ఆమె తెలిపారు. ఆయా తరగతుల్లో చేరడానికి ఆసక్తిగల ఎస్సీ విద్యార్థులు ఆధార్ కార్డు, తల్లిదండ్రులు ఆధార్ కార్డులు, తల్లి బ్యాంక్ పాస్ బుక్ ఫ్రెంట్ పేజీ జెరాక్స్, కులధ్రువీకరణ పత్రం రేషన్ కార్డు నంబర్, ఇంటర్‌లో చేరదలచినవారు పదో తరగతి మార్క్ షీట్‌తో గురుకులానికి చేరుకోవాలని సూచించారు.

ఇన్‌స్పైర్ మనక్ ప్రాజెక్టుల సమర్పణ గడువు వచ్చే నెల 15

ఆరిలోవ: ఇన్‌స్పైర్ మనక్-2025ప్రాజెక్టుల సమర్పణకు వచ్చే నెల 15 వరకు గడువు ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. ప్రేమ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల యూపీ, హైస్కూళ్ల సైన్స్ ఉపాధ్యాయులు నామినేషన్లను పంపించాలని కోరారు. యూపీ నుంచి మూడు, ఉన్నత పాఠశాలల నుంచి ఐదు ప్రాజెక్టులు, హైస్కూల్ ప్లస్ నుంచి ఏడు ప్రాజెక్టులు సైన్స్ ఉపాధ్యాయులు నామినేట్ చేయాలన్నారు. మరిన్ని వివరాల కోసం జిల్లా సైన్స్ ఆఫీసర్ పి.రాజారావు (9480662661), వీజీపీ శ్రీనివాస్ (9494641969), వీవీ జానకిరామ్ (9885166530)లను సంప్రదించాలని సూచించారు.

'మయామీ ఆఫ్ ది ఈస్ట్'గా విశాఖ

- థీమ్ నగరాల అభివృద్ధికి వీఎంఆర్‌డీఏ ప్రణాళికలు
- భీమిలి, శొంఠ్యాంతో పాటు మరో రెండు చోట్ల ప్రదేశాల గుర్తింపు
- పీపీపీ విధానంలో అభివృద్ధికి సన్నాహాలు



విశాఖ సిటీ: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో వినూత్న ప్రాజెక్టుల రూపకల్పనకు విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నీతి ఆయోగ్ సిఫార్సుల మేరకు విశాఖను 'బే సిటీ'గా 'మయామీ ఆఫ్ ది ఈస్ట్'గా అభివృద్ధి చేసేందుకు అడుగులు వేస్తోంది. ఇందుకోసం థీమ్ నగరాల అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతోంది. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చి ఆర్థిక ప్రోత్సాహం అందించే దిశగా ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తోంది. ఇందులో భాగంగా విశాఖలో ప్రత్యేకంగా థీమ్ బేస్డ్ టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే రెండు ప్రాంతాలను గుర్తించగా.. మరో ప్రదేశాల గుర్తింపు తుది దశలో ఉంది. పబ్లిక్, ప్రైవేట్, పార్టనర్‌షిప్(పీపీపీ) విధానంలో ఈ ప్రాజెక్టులను చేపట్టాలన్న ఆలోచనలో ఉంది.

నీతి ఆయోగ్ సిఫార్సులతో

విశాఖ ప్రపంచ స్థాయి నగరంగా ఎదిగేందుకు అవసరమైన అన్ని వనరులు పుష్కలంగా ఉన్నాయి. ప్రధానంగా తీర ప్రాంతం అదనపు ఆకర్షణగా నీతి ఆయోగ్ గుర్తించింది. దీంతో విశాఖను ఫ్లోరిడాలోని మయామీ నగరాన్ని ఆదర్శంగా తీసుకుని అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సిఫార్సులు చేసింది. దీని ప్రకారం వీఎంఆర్‌డీఏ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రతి పట్టణ క్లస్టర్‌ను ఒక ప్రత్యేక థీమ్ ఆధారంగా అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు. ఐటీ-ఇన్నోవేషన్, హెల్త్-వెల్‌నెస్, నాలెడ్జ్-ఎడ్యుకేషన్, టూరిజం-కల్చర్, లాజిస్టిక్స్-ట్రేడ్, వంటి రంగాలు ఆధారంగా వీటిని అభివృద్ధి చేయాలన్న ఆలోచనలో ఉన్నారు.

ప్రత్యేకంగా థీమ్ బేస్డ్ టౌన్‌షిప్‌లు

విశాఖలో మూడు థీమ్ బేస్డ్ టౌన్‌షిప్‌ల నిర్మాణంపై వీఎంఆర్‌డీఏ అధికారులు దృష్టి పెట్టారు. ఇందుకోసం ప్రాంతాలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే భీమిలి మండలం కొత్తవలస, ఆనందపురం మండలం శొంఠ్యాం గ్రామాలను గుర్తించారు. మరో రెండు ప్రదేశాల గుర్తింపు తుది దశలో ఉంది. వీటి ద్వారా నిర్దేశిత రంగాల్లో పెట్టుబడులు, ఉద్యోగావకాశాలు వస్తాయని అధికారులు భావిస్తున్నారు. వీటిని పీపీపీ మోడల్‌లో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. దేశ, విదేశాలకు చెందిన నగర ప్రణాళిక నిపుణులు, ఆర్కిటెక్ట్‌లు, ఇతర రంగాల నిపుణులతో ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌లు తెలిపారు.

ఏయూ-జేఎంఎం పరస్పర సహకార ఒప్పందం


ఏయూ వీసీకి ఒప్పంద పత్రాన్ని అందిస్తున్న జపాన్ ఆటోమేటిక్ మెషీన్ కో లిమిటెడ్ ప్రతినిధి

మద్దిలపాలెం: ఏయూ-జపాన్ ఆటోమేటిక్ మెషీన్ కో లిమిటెడ్(జేఎంఎం) మధ్య పరస్పర సహకారానికి రోడ్ మ్యాప్ రూపొందించేందుకు ఏయూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ హాల్లో శుక్రవారం సమావేశం జరిగింది. సమావేశంలో వైరింగ్ హార్నెస్, అధునాతన కనెక్టర్ తయారీ సాంకేతికతలు, అల్ట్రాసోనిక్ మెటల్ వెల్డింగ్ జాయింట్ల కోసం నాన్-డిస్ట్రక్టివ్ టెస్టింగ్ పద్ధతులు, మెషీన్ టూల్ డిజైన్ తయారీలో ఏఐ అప్లికేషన్లు అనే అంశాలపై చర్చించారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ ఏయూ ఆవిష్కరణలు, అప్లైడ్ రీసెర్చ్, పరిశ్రమ భాగస్వామ్యాలకు అనుగుణంగా జరిగిన ఒప్పందం మేరకు ఈ సమావేశం నిర్వహించామన్నారు. జేఎంఎం ప్రతినిధులు పాల్గొని తమ ఆలోచనలను పంచుకున్నారు. అకడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య కె.శ్రీనివాసరావు, డీన్ ఔట్రీచ్ ఆచార్య కె.రమాసుధ, పలువురు డీన్లు, అధికారులు పాల్గొన్నారు.

సకల సౌభాగ్యదాయినీ నమోస్తుతే

- వాడవాడలా వరలక్ష్మీ వ్రతాలు
- సామూహిక వ్రతాలతో కిక్కిరిసిన ఆలయాలు



బంగారు చీరలో లలితాదేవి, కన్యకాపరమేశ్వరి ఆలయంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు


వాసవీమాత సన్నిధిలో కుంకుమపూజలు


హారతులు అందుకుంటున్న భక్తులు

దాబాగార్డెన్స్: సకల సౌభాగ్యాలు ప్రసాదించే శ్రావణలక్ష్మి నామస్మరణతో నగరం మార్మోగింది. శ్రావణ పూర్ణిమకు ముందు వచ్చే పవిత్ర శుక్రవారం కావడంతో వరలక్ష్మి వ్రతాన్ని ప్రజలు తమ ఇంట భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ప్రతి ఇల్లూ ఓ దేవాలయంగా మారింది. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

స్వర్ణాలంకరణలో కనకమహాలక్ష్మి

నగరంలోని బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారు స్వర్ణాభరణాలంకరణలో ధగధగ మెరిసిపోతూ భక్తులకు దర్శనమిచ్చింది. దేవస్థానంలో వరలక్ష్మీ వ్రత పూజలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి, వేద మంత్రాలు, నాదస్వర వాయిద్యాల మధ్య ఉదయం 8.10 గంటలకు శ్రావణలక్ష్మి పూజలు ప్రారంభించారు. విశిష్ట శ్రావణలక్ష్మీ పూజలో 85 మంది ఉభయదాతలు నేరుగా పాల్గొన్నారు. పోస్టు ద్వారా వివరాలు పంపి డబ్బు చెల్లించిన 225 కుటుంబాల పేరిట అర్చన చేసి, వారికి కుంకుమ, ప్రసాదం పంపారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. శ్రావణ మాసంలో జరిగే పూజలో పాల్గొనదలచే భక్తులు 0891-2711725, 2568645 నంబర్లలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు.

లక్ష్మీదేవి వెండి ప్రతిమలు బహూకరణ: ఉదయం 8 గంటలకు మొదటి బ్యాచ్, 9.30కు రెండవ బ్యాచ్ పూజలో పాల్గొన్న మహిళల్లో డ్రా తీసి ఆలయ మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు (తాతాజీ) ఆలయ ఈవో, ఏఈవో చేతుల మీదుగా లక్ష్మీదేవి వెండి ప్రతిమలు బహూకరించారు. ఆలయ పర్యవేక్షకుడు టి.తిరుపతిరావు, వేదపండితులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

● ఏపీఎల్ ఆరంభం అదుర్స్




మైదానంలో మిథాలీరాజ్, విక్టరీ వెంకటేష్

- భరత్, రాహుల్ సెంచరీల మిస్
- వర్షం కారణంగా 14 ఓవర్లకు కుదింపు
- 13.2 ఓవర్లలో అమరావతి రాయల్స్ లక్ష్య ఛేదన

విశాఖ స్పోర్ట్స్: వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఫ్లడ్ లైట్ల వెలుగులో ఏపీఎల్ నాలుగో సీజన్ అట్టహాసంగా శుక్రవారం ప్రారంభమైంది. అయితే రెండో జట్టు బ్యాటింగ్‌కు దిగకముందే భారీ వర్షంతో మ్యాచ్ నిలిచింది. ఆరంభ మ్యాచ్‌లో కాకినాడ కింగ్స్‌పై టాస్ గెలిచి అమరావతి రాయల్స్ బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన కింగ్స్ ఐదు వికెట్లు కోల్పోయి 229 పరుగులు భారీ స్కోర్ చేసింది. కెప్టెన్ భరత్‌కు రాహుల్ తోడై స్కోర్‌ను పరుగులెత్తించారు. సెంచరీకి చేరువ(96, 5 ఫోర్లు, 9 సిక్సర్లు)లో రాహుల్ ఔటవగా, భరత్(93, 6 ఫోర్లు, 7 సిక్సర్లు) కూడా సెంచరీని చేజార్చుకున్నాడు. వర్షం కారణంగా మ్యాచ్‌ను 14 ఓవర్లలో 173 పరుగులు లక్ష్యంగా నిర్దేశించారు. అమరావతి రాయల్స్ బ్యాటర్లు రాణించడంతో 13.2 ఓవర్లలోనే 7 వికెట్ల నష్టానికి లక్ష్యాన్ని ఛేదించి, విజయకేతనం ఎగురవేశారు.

జన విజ్ఞాన వేదికకు ఆధారం సైన్స్, రాజ్యాంగం


మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి

సీతంపేట: సైన్సు, రాజ్యాంగం ఆధారంగా జనవిజ్ఞాన వేదిక పనిచేస్తుందని సంస్థ జాతీయ అధ్యక్షుడు వి.బ్రహ్మారెడ్డి అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం జరిగిన భావతరంగం వైజాగ్-2025 కార్యక్రమంలో దేశానికి కావలసిన న్యాయం, ఐక్యత అంశంపై ఆయన ప్రసంగించారు. జన విజ్ఞాన వేదిక ద్వారా సైన్స్‌ను వివిధ కళారూపాల్లో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. దేవుడు, కులం, మతం లేని సమాజం కోసం జన విజ్ఞాన వేదిక కృషి చేస్తుందన్నారు. నాగార్జున యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ 'గాంధేయ వాదం రాజకీయ ప్రాముఖ్యత'పై మాట్లాడుతూ మహాత్మాగాంధీ భావాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. గాంధీజీ పాటించిన 18 గుణాలను వివరించారు. ఓపీఏసీ ఫౌండర్ దండి ప్రియాంక, లా యూనివర్సిటీ మాజీ వీసీ సత్యనారాయణ, నన్నయ యూనివర్సిటీ మాజీ వీసీ జార్జ్ విక్టర్, కృష్ణాజీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి పృథ్వీరాజ్, జిల్లా అధ్యక్షుడు విజయ్‌చందర్ పాల్గొన్నారు.

మరణించి మరో ఇద్దరికి వెలుగునిచ్చి..


మృతుడు కన్నారావు నేత్రాలు దానం చేసేందుకు అంగీకారపత్రం అందిస్తున్న కుటుంబ సభ్యులు

పెందుర్తి: అనారోగ్యంతో మరణించిన ఇంటి పెద్ద నేత్రాలు దానం చేసి మానవత్వం చాటుకుంది ఓ కుటుంబం. చింతలగ్రహారం గవరపాలేనికి చెందిన కాళ్ల కన్నారావు(65) ఊపిరితిత్తులు, కిడ్నీ సంబంధిత వ్యాధులతో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఈ నేపథ్యంలో స్థానిక సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి దాడి శ్రీనివాస్ మృతుని కుటుంబ సభ్యులను సంప్రదించి, నేత్రదానంపై అవగాహన కలిగించారు. దీంతో కన్నారావు భార్య లక్ష్మి, కుమారుడు ముత్యాలనాయుడు, కుమార్తె లక్ష్మి అంగీకారం తెలిపారు. దీంతో ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి సారథ్యంలోని మొహిసిన్ ఐ బ్యాంక్ ప్రతినిధులు కన్నారావు నేత్రాలను సేకరించి ఆస్పత్రికి తరలించారు. పుట్టెడు దుఃఖంలోనూ కన్నారావు కుటుంబ సభ్యుల మానవత్వాన్ని స్థానికులు ప్రశంసించారు.

ఎంపీగా కొనసాగే నైతిక హక్కు భరత్‌కు ఉందా?

దాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి సొంత గనుల సాధన పక్కనపెట్టి, అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్ ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని ఆరాట పడుతున్న టీడీపీ విశాఖ ఎంపీ భరత్‌కు ఎంపీగా కొనసాగే నైతిక హక్కు ఉందా? అని సీపీఎం విశాఖ జిల్లా కమిటీ ప్రశ్నిస్తోందని ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం సొంత గనులు కేటాయించకపోవడం వల్లే ప్లాంట్ ఆర్థిక నష్టాల్లో కూరుకుపోతోందని, దేశంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ రంగ స్టీల్‌ప్లాంట్లకు సొంత గనులు కేటాయించి, విశాఖ ఉక్కుపైనే వివక్షత ఎందుకని ప్రశ్నించారు. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విశాఖ ఉక్కుకు సొంత గనులు సాధిస్తామని చేసిన వాగ్దానాన్ని ప్రజలు నమ్మి రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో ఎంపీగా భరత్‌ను గెలిపించారన్నారు. గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేస్తూ విశాఖ ఉక్కుకు సొంత గనుల సాధనకు కృషి చేయకపోవడం ఆక్షేపణీయమన్నారు. పైగా కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామిని టీడీపీ పార్లమెంట్ బృందంతో కలిసి ఆర్సెలార్ ప్లాంట్‌కు ఎన్‌ఎండీసీ నుంచి ఇనుప ఖనిజం కేటాయింపు, పైప్‌లైన్ క్లియరెన్స్‌లు వేగవంతం చేయాలని కోరడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని తరచూ ప్రకటిస్తున్న సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కల్యాణ్‌కు విశాఖ ఉక్కును కాపాడటానికి మించిన రాష్ట్ర ప్రయోజనాలు ఏమున్నాయో చెప్పాలన్నారు.

అణ్వాయుధ నిర్మూలనపై సదస్సు రేపు

మద్దిలపాలెం: ప్రపంచ శాంతిని కోరుతూ అణ్వాయుధాల నిర్మూలన ఆవశ్యకతపై ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రెలీజియస్ ఫ్రీడమ్ సంస్థ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించనున్నట్లు సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న ఉదయం 10 గంటలకు డాక్టర్ ఎల్.బి.కాలేజీ ఆవరణలోని గాంధీ సెంటర్ సెమినార్ హాల్లో సదస్సు ఉంటుందన్నారు. సదస్సుకు ఆచార్య వి. బాలమోహన్‌దాస్, ఆచార్య కె.రవి,రచయిత డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ తదితరులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఉత్సాహవంతులైన యువత, మేధావులు పాల్గొనాలని కోరారు.

శాప్ స్టేడియంలో క్రీడా పోటీల ప్రారంభం

మధురవాడ: హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని కొమ్మాది శాప్ స్టేడియంలో క్రీడా పోటీలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ నెల 14 వరకు వివిధ అంశాల్లో పోటీలు జరగనున్నాయి. 22 ఏళ్లలోపు పురుషులు, మహిళలకు కబడ్డీ, ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

12 జిల్లాలతో ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం

ఆర్ఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి డిమాండ్



ఎంవీపీ కాలనీ: కేంద్ర ప్రభుత్వం 2029 నాటికి ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం ఏర్పాటు చేయాలని రాయలసీమ రాష్ట్ర సమితి(ఆర్ఆర్ఎస్) అధ్యక్షుడు డాక్టర్ కుంచం వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. విశాఖ పర్యటనలో ఉన్న ఆయన శుక్రవారం నగరంలోని ఓ హోటల్లో విలేకరులతో మాట్లాడారు. రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా లేదా కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించాలన్నారు. 1953లో రాష్ట్రం విడిపోయినప్పుడు కర్నూల్‌ను రాజధానిగా ఏర్పాటు చేశారని, అనంతరం హైదరాబాద్‌కు రాజధానిని మార్చిన విషయాన్ని గుర్తు చేశారు. 1937 శ్రీభాగ్ ఒప్పందంతో రాయలసీమకు అన్యాయం జరిగిందన్నారు. ఈ ఒప్పందం జరిగి ఎనిమిది దశాబ్దాలవుతున్నా ఒప్పందంలోని ఒక్క అంశం కూడా నెరవేరలేదన్నారు. ఈ నేపథ్యంలో భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3ని సవరించి 12 జిల్లాలతో కూడిన రాయలసీమ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్లమెంట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరుతూ ప్రధాని మోదీకి ఇటీవల లేఖ రాసినట్లు పేర్కొన్నారు. రాయలసీమ, కోస్తా జిల్లాలకు సమాన సంఖ్యలో శాసనసభ స్థానాల కేటాయింపు, నీటి వనరుల పంపిణీపైనా దృష్టి సారించాలని ఆ లేఖలో పేర్కొన్నట్లు వెల్లడించారు.

మృతదేహాలకు పోస్ట్‌మార్టం పూర్తి

రెండో రోజూ పోలీసుల ముమ్మర విచారణ

దాబాగార్డెన్స్: ఫిషింగ్ హార్బర్ రోడ్డు బుక్కావీధిలోని ఓ వెల్డింగ్ దుకాణంలో గురువారం జరిగిన గ్యాస్ సిలిండర్ పేలుడు దుర్ఘటన మృతులకు శుక్రవారం పోస్ట్‌మార్టం ముగిసింది. సున్నపువీధి ప్రాంతానికి చెందిన చల్లా గణేష్(44), హెల్పర్ శ్రీను(29), చింతకాయల ముత్యాలు(27) మృతదేహాలను బంధువులకు అప్పగించారు. అనంతరం బంధువులు అంత్యక్రియలు పూర్తి చేశారు. తీవ్రంగా గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఎర్రా ఎల్లాజీ, రంగారావు పరిస్థితి విషమంగానే ఉందని, ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సన్యాసిరావు పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉందని వైద్యులు తెలిపారు.

ముమ్మర విచారణ..

ఘటనా స్థలంలో పోలీసులు, క్ల్యూస్ టీం శుక్రవారం కూడా ముమ్మర విచారణ చేపట్టారు. ఘటనా స్థలంలో ఆక్సిజన్ సిలిండర్లతో పాటు డొమెస్టిక్ సిలిండర్ కూడా ఉంది. వీటిలో ఏ సిలిండర్ ప్రమాదానికి కారణమైందన్న విషయం తేలాలి. డొమెస్టిక్ సిలిండర్ పేలితే అది ముక్కలైపోతుంది. కానీ అక్కడ ఉన్న సిలిండర్ బాగానే ఉంది. ఆక్సిజన్ సిలిండర్లు మూడు ఉండగా, ఒకదానికి మాత్రం పైన వాల్వ్ పడిపోయి ఉంది. సాధారణ సిలిండర్ కంటే ఆక్సిజన్ సిలిండర్ పేలుడు కారణంగానే భారీగా విస్ఫోటనం సంభవిస్తుంది. ఆ దిశగా పోలీసులు విచారణ చేపట్టారు. సముద్రంలో దొరికిన ఓ పరికరాన్ని మత్స్యకారులు వెల్డింగ్ షాపులో తెరిపించేందుకు ప్రయత్నించే క్రమంలో పేలుడు సంభవించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

పల్లాను టీడీపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పించాలి

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అనుచరుడు రౌతు శ్రీనివాసరావు టీడీపీకి తీవ్ర అవమానమని, అది పూర్తిగా గాజువాక టీడీపీ కార్పొరేటర్ల క్రాస్ ఓటింగ్ వల్లే జరిగిందని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ తెలిపారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ఓటమికి బాధ్యత వహిస్తూ తక్షణమే ఆయన టీడీపీ రాష్ట్ర అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విశాఖలో పల్లా అరాచకాలు రాన్రాను పెరిగిపోతున్నాయిని, రాష్ట్ర అధ్యక్షుడిగా ఇప్పటివరకు ఆయన ఏ జిల్లాలోనూ పర్యటించలేదన్నారు. ఎమ్మెల్యేగా భూకబ్జాలు, సెటిల్మెంట్లు చేస్తున్నారని, వారి అనుచరులు మాఫియాలా తయారై ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు. పల్లా ప్రస్తుతం తనకు మంత్రి పదవి వస్తుందని ప్రచారం చేసుకుంటూ దందాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆయన బండారం మొత్తం తన దగ్గర ఉందని, సీఎం చంద్రబాబు తనకు టైం ఇస్తే పూర్తి వివరాలతో వివరించనున్నట్లు తెలిపారు.

24 గంటల మంచినీటి సరఫరా పనులు సత్వరం పూర్తి


అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

దాబాగార్డెన్స్: నగరంలో జరుగుతున్న 24 గంటల మంచినీటి సరఫరా ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి ప్రజలకు నీటి సరఫరా ప్రారంభించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, మంచినీటి విభాగం పర్యవేక్షక ఇంజినీర్ కేవీఎస్ రవిని ఆదేశించారు. శుక్రవారం ఆయన మాధవధారలోని విశాఖపట్నం నార్త్-వెస్ట్ సెక్టార్‌లోని ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఈ ప్రాజెక్టు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నిధులతో అమలవుతోంది. ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టు పనులను కాంట్రాక్టర్ నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ఏడాది డిసెంబర్ 31 నాటికి పనులు పూర్తి కావాలని స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రాజెక్టు పరిధిలోని మాధవధార, మురళీనగర్, మర్రిపాలెం ప్రాంతాల్లో 24 గంటల నీటి సరఫరా ప్రారంభమైందని కమిషనర్ తెలిపారు. ఈ ప్రాంతాల్లో ఇప్పటివరకు 5,000 మంచినీటి కనెక్షన్లు అందించామని, నీటి వినియోగానికి అనుగుణంగా బిల్లులు సిద్ధం చేయాలని సూచించారు. బిల్లులను ఈఆర్‌పీ మాడ్యూల్‌లో నమోదు చేసేందుకు అవసరమైన సాంకేతిక ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వినియోగదారుల అవగాహన కోసం ముందుగా నమూనా బిల్లులు జారీ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఈఈలు ఏడుకొండలు, మురళీకృష్ణ, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ సతీష్,ఏఈలు రాజ్‌కుమార్, సుమన్, ఎన్‌సీసీ డీజీఎం రంగారావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి స్వాతంత్ర్య వేడుకలకు జయశ్రీ

దాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్ జయశ్రీ, రాష్ట్ర స్థాయిలో విజయవాడలో జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ కె.గీతాంజలి, అధ్యాపకులు డాక్టర్ పీఎల్ శరణ్య, డాక్టర్ ఎ.హైమావతితో పాటు ఇతర అధ్యాపకులు ఆమెను అభినందించారు.

సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

విశాఖ-లీగల్: ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని అన్ని న్యాయస్థానాల్లో సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవడానికి ఇది ఒక మంచి అవకాశమన్నారు. న్యాయ స్థానాల్లో ఉన్న పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాల కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం కేసులు, బ్యాంకు, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక, కుటుంబ తగాదాలు (విడాకులు కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సేవా సదన్, విశాఖపట్నంలో లేదా 0891 - 2560414, 2575046 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు. అలాగే vskpdlsa@yahoo. com, dlsa. vsp@gmail. com మండల న్యాయ సేవా సంఘాలు (భీమిలి, గాజువాక, అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి, చోడవరం , మాడుగుల, అరకు, చింతపల్లి, పాడేరు)లో సంప్రదించాలని పేర్కొన్నారు.